# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 09-07-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ప్రపంచంలో వేగవంతమైన ఆర్థిక వ్యవస్థగా భారత్ ముందుకు సాగుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.
- దేశ సముద్ర ఆహార ఎగుమతులు ఆర్థిక వ్యవస్థకు చోదక శక్తిగా మారనున్నాయని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ తెలిపారు.
- కేంద్ర హోం మంత్రి అమిత్ షా అధ్యక్షతన సరిహద్దు జిల్లాల పోలీసు సూపరింటెండెంట్ల సమావేశం ఢిల్లీలో జరిగింది.
- అమర్‌నాథ్ యాత్ర నేపథ్యంలో జమ్మూ కాశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో సరిహద్దు ప్రాంతాలను చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ జనరల్ ధీరజ్ సేథ్ సందర్శించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రపంచంలో వేగవంతమైన ఆర్థిక వ్యవస్థగా భారత్ ముందుకు సాగుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఆస్ట్రేలియాలోని `మెల్‌బోర్న్ మీట్స్ మోదీ` కార్యక్రమంలో ప్రవాస భారతీయులను ఉద్దేశించి ప్రధాని ఈరోజు ప్రసంగించారు. అంతర్జాతీయంగా రెండవ అతిపెద్ద 5జీ మార్కెట్‌గా భారత్ మారిందని ఈ సందర్భంగా చెప్పారు. మేడిన్ ఇండియాలో భాగంగా 6జీ దిశగా భారత్ పయనిస్తోందన్నారు. చిప్ నుంచి షిప్స్ వరకు తయారీ రంగాన్ని సరికొత్త రీతిలో అభివృద్ధి చేస్తున్నామని ప్రధానమంత్రి చెప్పారు. భారతదేశ స్వదేశీ రక్షణ వ్యవస్థలకు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న విశ్వసనీయతను ప్రస్తావించారు. భారత్ - ఆస్ట్రేలియా సంబంధం సాధారణ దౌత్యానికి అతీతంగా ఎంతో అభివృద్ధి చెందిందని నరేంద్ర మోదీ పేర్కొంటూ...

(వాయిస్ 29 సెకన్లు)

ఈ కార్యక్రమంలో ఆస్ట్రేలియా ప్రధానమంత్రి ఆంథోనీ అల్బనీస్ మాట్లాడుతూ... భారతదేశంతో ఆస్ట్రేలియాకు ఉన్న గాఢమైన అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశ సముద్రపు ఆహార ఎగుమతులు 73 వేల కోట్ల రూపాయలను దాటాయని.. ప్రస్తుతం 120కి పైగా దేశాలకు అవి చేరుతున్నాయని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ తెలిపారు. భువనేశ్వర్‌లోని ఒడిశా వ్యవసాయ సాంకేతిక విశ్వ విద్యాలయంలో `భారతదేశ సముద్ర మత్స్య వనరుల సుస్థిర వినియోగం` అన్న అంశంపై నిర్వహిస్తున్న జాతీయ కార్యక్రమాన్ని ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సముద్ర వనరుల ద్వారా లభించే ఆర్థిక వ్యవస్థ దేశానికి చోదక శక్తిగా అభివర్ణించారు. వికసిత్ భారత్ కి సముద్ర వనరులు మూలస్తంభమని పేర్కొన్నారు. ఆధునిక సాంకేతికత ఆధారితమైన మత్స్య సంబంధిత వృత్తులను యువత స్వీకరించాలని ఉపరాష్ట్రపతి పిలుపునిస్తూ...

(వాయిస్ 26 సెకన్లు)

================================

కేంద్ర హోం మంత్రి అమిత్ షా అధ్యక్షతన సరిహద్దు జిల్లాల పోలీసు సూపరింటెండెంట్ల (SPలు) సమావేశం ఢిల్లీలో ఈరోజు జరిగింది. జమ్మూ-కశ్మీర్, పంజాబ్, ఉత్తరాఖండ్, రాజస్థాన్, గుజరాత్, ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్ ఈశాన్య రాష్ట్రాలతో సహా సరిహద్దు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన పోలీసు సూపరింటెండెంట్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. సున్నితమైన సరిహద్దు ప్రాంతాల్లోని ప్రస్తుత పరిస్థితులను అంచనా వేయడం, భద్రతా పరమైన చర్యలను మరింతగా మెరుగుపరిచే విధంగా కార్యాచరణను సిద్ధం చేయడం ఈ సమావేశం యొక్క ముఖ్య ఉద్దేశ్యంగా అధికార వర్గాలు పేర్కొన్నాయి.

================================

అమర్‌నాథ్ యాత్ర నేపథ్యంలో జమ్మూ కాశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలోని సరిహద్దు ప్రాంతాలను చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ జనరల్ ధీరజ్ సేథ్ ఈరోజు సందర్శించారు. అక్కడ నెలకొన్న భద్రతా పరిస్థితిని ఆయన సమీక్షించారు. నగ్రోటాలోని వైట్ నైట్ కార్ప్స్ ప్రధాన కార్యాలయాన్ని కూడా సందర్శించారు. జమ్మూ ప్రాంతంలోని భద్రతా పరిస్థితి గురించి సీనియర్ కమాండర్లు ధీరజ్ సేథ్ కు ఈ సందర్భంగా వివరించారు. పూంచ్ బ్రిగేడ్ ప్రధాన కార్యాలయంలో సైనికాధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఇదిలా ఉండగా ఈ నెల 7 నుండి జమ్మూ కాశ్మీర్ లో ధీరజ్ సేథ్ పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాను కలిసి కాశ్మీర్‌లో మొత్తం భద్రతా పరిస్థితిని సమీక్షించారు.

================================

మహిళా అభివృద్ధికి సంబంధించిన అనేక ఉమ్మడి అంశాలను బ్రిక్స్ సభ్య దేశాలు పంచుకుంటున్నాయని కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ మంత్రి అన్నపూర్ణా దేవి అన్నారు. కేరళంలోని కొచ్చిలో ఈ నెల 6 నుంచి నాలుగు రోజులు పాటు జరిగిన “బ్రిక్స్ మహిళా మంత్రుల సమావేశం” ఈ రోజుతో ముగిసింది. ఈ ముగింపు సమావేశంలో పాల్గొన్న అన్నపూర్ణా దేవి మాట్లాడుతూ... బ్రిక్స్ సభ్య దేశాల మధ్య చర్చలను ప్రోత్సహించడానికి, సహకారాన్ని బలోపేతం చేయడానికి బ్రిక్స్ మహిళా మంత్రుల సమావేశాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు.

విరామం

================================

కృత్రిమ మేధ (ఎఐ) ఆధారిత పరిష్కారాలకు భారతదేశాన్ని ప్రపంచంలో కీలకంగా మార్చడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర ఎలక్ట్రానిక్స్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఎస్. కృష్ణన్ తెలిపారు. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్ గ్లోబల్ కెపాసిటీ సెంటర్స్ (జీసీసీ) బిజినెస్ సమ్మిట్ 2026 ఢిల్లీలో ఈరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం కృత్రిమ మేధను సానుకూల, ఆశావాద దృక్పథంతో

చూస్తోందన్నారు. విస్తృత శ్రేణి రంగాల్లో ఉత్పాదకత సామర్థ్యం పెంచడానికి ఏఐను వినియోగించుకోవడంపై దృష్టి సారించినట్లుగా ఆయన తెలిపారు. కృత్రిమ మేథను సమర్థవంతంగా నిర్వహిస్తూ... ప్రపంచ ఏఐ ఎకో సిస్టమ్ కు భారత్ ఎలా  దోహదపడగలదనే దానిపై కేంద్ర ప్రభుత్వం పని చేస్తోందని కృష్ణన్ అన్నారు. అనంతరం ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు డాక్టర్ వి. అనంత నాగేశ్వరన్ మాట్లాడుతూ... ప్రస్తుతం ప్రపంచంలోని దాదాపు సగం గ్లోబల్ కెపాసిటీ సెంటర్లకు భారతదేశంలోనే ఆతిథ్యం లభిస్తోందన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రైతుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు తమిళనాడులోని రైతుల నుంచి ఖోప్రా, తోతాపురి మామిడి పండ్ల సేకరణకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీని వల్ల ఉత్పత్తిదారులకు మెరుగైన ధర లభిస్తుందని, మార్కెట్ హెచ్చుతగ్గుల కారణంగా ఎదురయ్యే నష్టాలను నివారించడం జరుగుతుందని కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ పేర్కొంది. తమిళనాడు సమర్పించిన ప్రతిపాదన ఆధారంగా ఈ ఆమోదం లభించింది. దీంతో ఆ రాష్ట్రంలో 87 వేల మెట్రిక్ టన్నులకు పైగా ఖోప్రాను సేకరించనున్నారు. దీని ద్వారా తోతాపురి మామిడి రైతులు తమ పంటకు సరసమైన, లాభదాయకమైన ధరలను పొందేలా చూడటం, అలాగే మార్కెట్ ధరలలో ఆకస్మిక తగ్గుదల కారణంగా నష్టానికి అమ్ముకోవలసిన పరిస్థితి నుండి వారిని రక్షించడం.. ధరల స్థిరత్వాన్ని అందించి రైతుల ఆదాయాలను కాపాడి వారి పంటకు మెరుగైన రాబడిని చేకూరుస్తుందని భావిస్తున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ పూణే-ముంబై ఘాట్ సెక్షన్‌లో రైల్వే లైన్ల పునరుద్ధరణ పనులను ఈ రోజు సమీక్షించారు. కొండచరియలు విరిగిపడటంతో రైల్వే లైన్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాలకు కూడా గణనీయమైన నష్టం వాటిల్లింది. వీలైనంత త్వరగా లైన్లను పునరుద్ధరించేందుకు సెంట్రల్ రైల్వే, వెస్ట్రన్ రైల్వే బృందాలు, జిల్లా అధికారులు.. అటవీ శాఖతో సమన్వయం చేసుకుంటున్నాయని కేంద్రమంత్రి తెలిపారు. ఇదిలా ఉండగా ఒక లైన్‌ను ఇప్పటికే పునరుద్ధరించామని, ఈ లైన్‌లలో అన్ని రైళ్లను రెండు లోకోమోటివ్‌లతో నడపాలని రైల్వే శాఖ పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉత్తరాఖండ్ దేశంలో ఆరవ సంపూర్ణ అక్షరాస్యతా రాష్ట్రంగా అవతరించింది. `జాతీయ విద్యా విధానం-2020` `ఉల్లాస్` కార్యక్రమం కింద ఉత్తరాఖండ్ ఈ లక్ష్యాన్ని సాధించింది. కేంద్ర ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ పరిధిలోని పాఠశాల విద్య అక్షరాస్యతా విభాగం నిర్దేశించిన ప్రమాణాలను నెరవేర్చిన నేపథ్యంలో ఉత్తరాఖండ్ కి ఈ ఘనత దక్కింది. ఈ విజయంతో ఉత్తరాఖండ్ సంపూర్ణ అక్షరాస్యతా రాష్ట్రాల జాబితాలో మిజోరం, గోవా, త్రిపుర, హిమాచల్ ప్రదేశ్, సిక్కిం సరసన చేరింది. ఈ విజయాన్ని చారిత్రాత్మకమైనదిగా అభివర్ణిస్తూ.. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి ఇది ప్రభుత్వ నిరంతర కృషికి, ప్రజల క్రియాశీల భాగస్వామ్యానికి నిదర్శనమన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నైరుతి రుతుపవనాలు దేశమంతటా విస్తరించాయని భారత వాతావరణ విభాగం (IMD) తెలిపింది.  రాజస్థాన్, హర్యానా, పంజాబ్ రాష్ట్రాల్లోని మిగిలిన ప్రాంతాలకు ఉత్తర అరేబియా సముద్రం వైపునకు మరింతగా విస్తరించాయని IMD పేర్కొంది. IMD సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ నరేష్ కుమార్ ఈరోజు ఆకాశవాణితో మాట్లాడుతూ... గత కొన్ని రోజులుగా ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ ప్రాంతాల్లో మోస్తరు నుండి భారీ వర్షాలు కురుస్తున్నాయని తెలిపారు. ఢిల్లీ ప్రాంతంలో మోస్తరు నుండి భారీ వర్షాల కారణంగా  ఈరోజు `ఆరెంజ్ అలర్ట్` జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

(వాయిస్ 26 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఐదు మ్యాచ్‌ల టీ-20 సిరీస్‌లో భాగంగా భారత్–ఇంగ్లాండ్ పురుష జట్ల మధ్య నాల్గవ టీ-20 క్రికెట్ మ్యాచ్ ఈరోజు ఇంగ్లాండ్‌లోని బ్రిస్టల్ లో జరగనుంది. ఈ మ్యాచ్ భారత కాలమానం ప్రకారం రాత్రి 10 గంటలకు ప్రారంభమవుతుంది.

==================================

==================================